# నీటి సంపులకు నిధుల కొరత

- మట్టి సంపులతో నీరు వృథా
- వేలు ఖర్చు చేసినా నీరు ఇంకిపోతోంది
- నిలిచిన డ్రిప్ పరికరాలు సబ్సిడీ
- ఈజీఎస్‌లో నిధులు మంజూరు చేసి సీసీ బెడ్‌లు నిర్మించాలి

శాంతినగర్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న చిన్న, సన్నకారు రైతులకు పంట పండనిదే కడుపునిండదు. బోరు బావుల్లోని కొద్దిపాటి నీటిని ఒడిసి పట్టి పొలాల్లో నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసుకున్న సంపులే నీటిని మింగుతున్నాయి. ఆర్థిక స్తోమతలేక నీటి ట్యాంకులు సీసీబెడ్‌తో నిర్మించుకోలేక, పంటలకు పూర్తి స్థాయిలో నీరందించలేక సతమతమవుతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో చిన్న, సన్నకారు రైతులు వేలల్లో ఉన్నారు. ఎకరం, రెండెకరాల పొలంలో సాగునీటి కోసం ఎన్నో బోరుబావులు తవ్వుకున్నారు. బోరుబావుల నుంచి వచ్చే కొద్దిపాటి నీటిని నిల్వ చేసుకునేందుకు పొలాల్లోని ఎత్తైన ప్రదేశంలో మట్టితో సంపులు నిర్మించుకున్నారు. నీటిని సంపుల్లో నిల్వ చేసుకుని పంటలకు పారించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. రాత్రి సమయంలో సంపులో నీటిని నిల్వ చేస్తే ఉదయం వరకు ఇంకిపోతున్నాయి. దీంతో రెండెకరాలకు అందాల్సిన నీరు ఎకరానికే పారడం లేదు. సీసీ బెడ్లతో సంపులు ఏర్పాటు చేసుకుందామంటే ఆర్థిక స్తోమతలేక పొలాల్లోని మట్టిని చుట్టూ గెట్లవలె నిర్మించుకుని నీటిని నిల్వ చేసుకుని పొలాలకు పారిస్తున్నారు. ఓవైపు నీటి కొరతతో పాటు నిల్వ చేసిన నీరు పాచిపడుతూ పంటలకు నష్టం వాటిల్లుతోంది. మరోవైపు త్రీ ఫేస్ కరెంట్ అవసరం ఎక్కువవుతుంది. మట్టి సంపుల్లో విషసర్పాలు చేరి తరచు పాము కాటుకు రైతులు బలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఈజీఎస్, వ్యవసాయశాఖ అధికారులు స్పందించి ఈజీఎస్ పథకంలో నీటి సంపులకు నిధులు మంజూరు చేసి అన్నదాతలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మట్టిట్యాంకులో నీటిని నిల్వ చేసుకుంటున్న రైతులు

### బోరు బావులు ఎండిపోతున్నాయి..

నీటి అవసరం ఎక్కువగా ఉన్నందున బోరు బావులను ఎక్కువ సమయం వాడుకోవాల్సి వస్తోంది. దీంతో బావుల్లోని నీరు తగ్గిపోయి ఎండిపోయే పరిస్థితులు దాపురించాయని రైతులు చెబుతున్నారు. డ్రిప్ పరికరాలైనా ఇవ్వాలని, లేని పక్షంలో నీటి సంపుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

**విషసర్పాల మధ్య వ్యవసాయం..**

పొలాల్లో ఏర్పాటు చేసిన మట్టి ట్యాంకుల్లో విషసర్పాలు చేరి భయాందోళనకు గురి చేస్తున్నాయి. మట్టి ట్యాంకుల్లో కన్నాలు ఏర్పాటు చేసుకుని కప్పల కోసం బయటకు వస్తాయి. నీటిని విడుదల చేయడానికి ట్యాంకులో దిగితే పాముకాటుకు బలైపోతున్నామని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కరెంట్ వృథా..**

సీసీ బెడ్లతో ట్యాంకు నిర్మాణం చేస్తే నీటి నిల్వలు తగ్గవని రైతులు చెబుతున్నారు. మట్టి ట్యాంకుల్లో నీటిని నిల్వ చేయడం వల్ల మట్టిలోకి నీరు ఇంకిపోయి ఎక్కువ సమయం బోరు మోటార్లు వాడుకోవాల్సి వస్తోంది. దీంతో కరెంట్ ఎక్కువ అవసరం పడుతోంది. సీసీ ట్యాంకుల నిర్మాణానికి నిధులు ఇస్తే కరెంట్ చాలా వరకు మిగులుతుంది.

### నీళ్లన్నీ ఇంకిపోతున్నాయి..



మాకున్న రెండెకరాల పొలానికి రెండు బోరుబావులు తవ్వుకున్నాం. బోరు బావుల నుంచి వచ్చే కొద్దిపాటి నీటిని మట్టి సంపులో నిల్వచేస్తున్నాం. కొద్దిపాటి నీరు పొలానికి మట్టి కాల్వల్లో విడుదల చేస్తే రెండు గుంట్లే పారుతున్నాయి. పొలాల్లో ఎలాగూ సిమెంట్ కాల్వలు నిర్మించడానికి అవకాశం ఉండదు. మట్టి సంపుల స్థానంలో సిమెంట్, కంకర బెడ్‌తో సంపులు నిర్మించుకోవడానికి నిధులిస్తే నీటిని పొదుపుచేసుకుని పంటలు పండించుకుంటాం.

– పెద్ద నర్సింహులు, రైతు, యాపదిన్నె

### డ్రిప్‌లు ఇవ్వడంలేదు..



గతంలో డ్రిప్‌పరికరాలు సబ్సిడీపై ఇచ్చేవారు. బోరుబావుల్లోని కొద్దిపాటి నీటిని డ్రిప్‌ల ద్వారా పంటలకు అందించేవాళ్లం. ఇప్పుడేమో ప్రభుత్వం డ్రిప్ పరికరాలు ఇవ్వడంలేదు. డ్రిప్‌లు, పైప్ లైన్ వేసుకోవాలంటే లక్షల్లో డబ్బులు అవసరం ఉంటుంది. ఆర్థిక స్తోమతలేక మట్టి సంపుల్లో నీటిని నిల్వ చేసుకుంటున్నాం. పంటలకు చాలడంలేదు. ట్యాంకులకైనా నిధులు మంజూరు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– బతుకన్న, రైతు, యాపదిన్నె

## గ్రామాల్లో ఫీవర్ సర్వే


రాజోళిలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

రాజోళి: మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్ తెలిపారు. మెడికల్ ఆఫీసర్ మధు బాబు ఆధ్వర్యంలో గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో సర్వే నిర్వహించారు. ఇంట్లో ఎవరికైనా జ్వరం, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి అనారోగ్యాలున్నాయా? అని అడిగి తెలుసుకోవడంతో పాటు వారికి ముందస్తుగా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తెలిపారు. అనారోగ్యం ఉన్న వారికి మందులు అందజేసి వారికి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రంజిత్ కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీధి దీపాలు లేక ఇబ్బందులు

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని వీధి దీపాలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో పాములు, విషకీటకాలు రోడ్లపైకి వస్తున్నాయి. రాత్రి వేళ బయటకు వెళ్లాలంటే స్థానికులు జంకుతున్నారు. ఇందిరమ్మ కాలనీ మొత్తానికి పది లైట్లు వెలుతురు ఇస్తున్నాయి. మిగతా స్తంభాలకు వీధి దీపాలు బిగించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోని వీధి దీపాలు ఏ ర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని కల్లు దుకాణాలపై శనివారం గద్వాల ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. కల్లు విక్రయాలపై నాలుగు రోజులుగా పత్రికల్లో వస్తున్న వార్త కథనాలపై ఎక్సైజ్ అధికారులు కల్లు దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న నిర్వాహకులు దుకాణాల్లో ఉన్న కల్లును ముందుగానే పారబోసి పరారయ్యారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు, తదితరులు ఉన్నారు.

### ప్రతిభ చూపిన విద్యార్థిని


రాజేశ్వరి

అయిజ: జిల్లా స్థాయి అథ్లెటిక్‌లో శనివారం నిర్వహించిన అండర్ –14, 16 విభాగాల్లో పాల్గొన్న అయిజ కేజీబీవీకి చెందిన విద్యార్థిని రాజేశ్వరి రెండు పథకాలను సాధించింది. ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం కైవసం చేసుకుంది. విద్యార్థినిని కేజీబీవీ ఎస్‌ఓ చిన్న బసమ్మ, సీఆర్‌టీలు అభినందించారు.

### విద్యార్థులకు సత్కారం



అయిజ: పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. శనివారం తేజశ్విని, శృతిహాసన్ విద్యార్థినులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సన్నీ మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారని, తోటి విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సమయానుకూలంగా బస్సులు నడపాలి

ధరూరు: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్‌టీసీ బస్సులను సమయానుకూలంగా నడిపించాలని ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి ఆర్‌టీసీ అధికారులను కోరారు. శనివారం ఆయన విద్యార్థులు ఎదుర్కొంటున్న బస్సు సమస్యపై వివరించారు. ఉదయం 7 గంటలకు నందిన్నె నుంచి బస్సు బయలుదేరేలా చూడాలని, సాయంత్రం గద్వాల నుంచి 4గంటలకు బయలు దేరి నందిన్నె వరకు బస్సులు నడిపించాలని కోరారు. రాయచూర్, గద్వాల నుంచి బస్సులు ఫుల్‌గా రావడంతో విద్యార్థులు గత్యంతరం లేక ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్నారని, కొంత మంది విద్యార్థులు ఉదయం రెండు క్లాస్‌లను కోల్పోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపించాలని ఆయన ఆర్‌టీసీ డీఎంను సామాజిక మాధ్యమం ద్వారా కోరారు.

### దోమలను నివారించాలి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో దోమల బెడద పెరిగిపోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు దోమలతో డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులకు గురవుతున్నట్లు తెలిపారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టి దోమల బెడదను నివారించాలని డిమాండ్ చేశారు.

### సంస్మరణ సభను జయప్రదం చేయండి



శాంతినగర్: కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం పోస్టర్లు విడుదల చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులందరు కలిసి పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడ్ కార్తీక్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని, అందరు పాల్గొని కామ్రేడ్‌కు నివాళులు అర్పించాలని కోరారు. కార్యక్రమంలో మధు, తిమ్మప్ప, మద్దిలేటి, ప్రభుదాసు, పెద్దయ్య, శ్రీరాములు, దస్తగిరి, మద్దిలేటి పాల్గొన్నారు.

### ముళ్ల పొదలు తొలగించండి

అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్యన పెద్దవాగులో ముళ్లపొదలు దట్టంగా వ్యాపించాయి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు నిబంధనలు ఉల్లంఘించి వాగులో మట్టిదిబ్బలు వేశారు. భారీ వర్షాలకు వాగు ఉప్పొంగితే వరద ప్రవాహానికి ముళ్ల పొదలు, మట్టి దిబ్బలు అడ్డంకిగా మారుతాయి. దీంతో వాగుపక్కనున్న నివాస గృహాల్లోకి వరదనీరు ప్రవహించే ప్రమాదం ఉంది. అధికారులు, పాలకులు స్పందించి వాటిని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి


ఉండవెల్లిలో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉండవెల్లి: మండల కేంద్రంలో అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవ, ఆయన మేధాశక్తి గురించి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దిలేటి, శ్రీలక్ష్మి, సత్యనారాయణ, నాయకులు వెంకటేష్‌గౌడ్, రవి, రమేష్ పాల్గొన్నారు.


మాల్‌దొడ్డిలో ఏపీజే అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్

ధరూరు: మండలంలోని మాల్‌దొడ్డి గ్రామంలో ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సామాజిక కార్యకర్త అంజిసాగర్ నేతృత్వంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం వర్ధంతి వేడుకలకు ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ హాజరై కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొ నియాడారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హు స్సేన్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లికో మొక్క పెంచాలి



మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో 'శిక్ష–సప్తహ' అనే ఏకోక్లబ్ కార్యక్రమం వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'తల్లికో మొక్క' అనే కార్యక్రమంతో విద్యార్థి, తల్లి ఇద్దరు కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## బోయలగూడెంలో పశువైద్య శిబిరం

గట్టు: మండలంలోని బోయలగూడెంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకంలో భాగంగా ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ సహకారంతో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 45 పశువులకు పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. పశువైద్య శిబిరాన్ని ఎంపీడీఓ చెన్నయ్య సందర్శించారు. అనంతరం పాఠశాలను ఎంపీడీఓ చెన్నయ్య సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, బడి బయట పిల్లలందరిని బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల సమస్యలను ఉపాధ్యాయులు ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, వెటనరి అసిస్టెంట్లు పృథ్వీరాజ్, కనకరాజు, వ్యవసాయ విస్తర్ణ అధికారి భక్తవత్సల, భవిష్యత్ భారత్ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ బాలరాజు, రాజారాం, లైవ్లీహుడ్ అధికారి హరికృష్ణ, అడ్మిన్ అసిస్టెంట్ మునిస్వామి, రైతులు పాల్గొన్నారు.


బోయలగూడెంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరం

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మల్దకల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, వెంకటస్వామి, జ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


మల్దకల్‌లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వరూపరాణి

## ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌కు చెందిన రఘు ఆపరేషన్ కోసం రూ.80 వేల ఎల్‌ఓసీ కాపీని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు శనివారం అందజేశారు. వెంటనే ఆపరేషన్ చేయాల్సి ఉన్నందున ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కోసం బాధిత కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న ఎమ్మెల్యే వద్దకు బయల్దేరి వెళ్లారు. అసెంబ్లీకి కారులో వెళ్తున్న క్రమంలో శాంతినగర్ వాసులు ఎమ్మెల్యేను కలిశారు. వెంటనే కారుదిగిన ఎమ్మెల్యే బానట్ టాప్‌పై ఎల్‌ఓసీ కాపీని ఉంచి అక్కడే సంతకం చేసి అసెంబ్లీకి బయల్దేరి వెళ్లారు. మానవత్వంతో వెంటనే స్పందించి సంతకం చేసిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట శాంతినగర్‌కు చెందిన మహిపాల్‌రెడ్డి, పుల్లూరు రఘురెడ్డి, అనీల్‌కుమార్‌లు ఉన్నారు.

## మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం

శాంతినగర్: మన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు వడ్డేపల్లి మాదవస్వామి గట్టుపై ప్రభుత్వ స్థలంలో గుంతలు తీసే కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు శనివారం చేపట్టారు. ట్రాక్టర్ మిషన్‌తో వందల మొక్కలు నాటేందుకు గోతులు తవ్విస్తున్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే మొక్కలు నాటుతామని కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు.


గోతులు తవ్వుతున్న ట్రాక్టర్ మిషన్

## హామీలు నెరవేర్చకుంటే ఆందోళన చేపడతాం

శాంతినగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి గొంగళ్ల ఈశ్వర్ అన్నారు. వడ్డేపల్లి పురపాలికలో కార్యవర్గ సమావేశం మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. అమలుకు నోచుకోని అనేక వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటలకు మాత్రమే పరిమితమైందన్నారు. సమావేశంలో మధుసూదన్‌గౌడ్, సంజన్నగౌడ్, రవియాదవ్, రాఘవేంద్ర, పైపాడు శివ, సురేష్, వేణు, వంశి, గణేష్, పరుశరాముడు, వినోద్‌లు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా అధికార ప్రతినిధి గొంగళ్ల ఈశ్వర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

**కాంగ్రెస్ పాలనలో అన్నీ మోసాలే**

రాజోళి: కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది అన్నీ కుట్రలు, మోసాలేనని బీజేపి రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదన్న అన్నారు. మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణస్వామి ఆలయంలో మండల అధ్యక్షుడు సంజీవ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈసీ అంజనేయులు,రాము, మల్లేష్, శశి, గోవిందురాజులు, రాజేష్, తిరుమలేష్, అడివిస్వామి పాల్గొన్నారు.

**స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి**

ఎర్రవల్లిచౌరస్తా: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తాచాటాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిమ్మారెడ్డి అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని ఉదండాపురంలో మండలాధ్యక్షుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా నూతన రేషన్‌కార్డుల జాడే లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, కల్యాణ కృష్ణ, మహేష్, శివ, వెంకటేష్ ఉన్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణం

ఎర్రవల్లిచౌరస్తా: కోదండాపురం ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం వికాస్ తరంగిని ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రచారక్ నర్సింహస్వామి హాజరై ఆలయంలో ఐదు సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## ఘనంగా బోనాల పండుగ


బోనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అయిజ: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అక్షర, గీతాంజలి పాఠశాలల్లో బోనాల పండుగ కనుల పండువగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణతో ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే రోగాల నుంచి ప్రజలను, పాడి పంటలను కాపాడాలని గ్రామదేవతలను వేడుకొని నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బోనమెత్తిన చిన్నారులు**

గట్టు: మండలంలోని అంతంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల పండుగను పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ బద్ధంగా పాఠశాలలో ఏర్పాటు చేశారు. విద్యార్థులు బోనాలు ఎత్తుకొని గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. పోతురాజు విన్యాసాలు, విద్యార్థుల నృత్యాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెడ్మాస్టర్ రాజు, ఉపాధ్యాయులు అశోక్, పరశురాములు, ఎంవీఎఫ్ వలంటీర్ దానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


వివిధ వేషధారణలో బోనాలు ఎత్తుకున్న విద్యార్థులు

## బురదరోడ్లతో ప్రజల ఇక్కట్లు


పచ్చర్లలో బురదమయంగా మారిన ప్రధాన రోడ్డు

రాజోళి: మండలంలోని పచ్చర్లలో రోడ్లన్నీ బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు తిరిగే రోడ్లన్నీ బురదమయం కావడంతో అడుగు తీసి, అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. కాలనీల్లో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు మొత్తం రోడ్లపైనే ప్రవహించి, దుర్వాసన వస్తోంది. దోమలు పెరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వాటిపై అధికారులు చర్యలు తీసుకుని, గ్రామంలో వ్యాధుల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎండుతున్న పత్తిపంట

మానవపాడు: పంటను కాపాడుకోవడానికి రైతులు వినూత్నరీతిలో వివిధ రకాల ప్రయోగాలు చేస్తుంటారు. పత్తిపంటలో కలుపు తీసేందుకు కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఓ రైతు కలుపు నివారణకు గడ్డి మందు పిచికారీ చేశాడు. దీంతో పంటసైతం ఎండిపోయింది. మండలంలోని పెద్ద పోతులపాడు గ్రామానికి రైతు తన పత్తి పంట మూడు ఎకరాల్లో సాగుచేశాడు. కలుపు నివారణ కోసం గడ్డి మందు కొట్టడం వల్ల పంట ఎండిపోయింది. ఎకరాకు రూ. 20వేలు ఖర్చు అయిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.


పెద్దపోతులపాడు శివారులో గడ్డి మందు పిచికారీ చేయడంతో ఎండిన పత్తిపంట